


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి–అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.

హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్ వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)

అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.

# గుండమ్మ కథ - 15

సూటు బూటులో ఆంజనేయప్రసాద్, పట్టు చీరలో ఏడువారాల నగలతో మహాలక్ష్మిలా లక్ష్మి సూటుకేసుతో గుండమ్మ ఇంటికి వస్తారు. ఎదురుగా సోఫాలో కూర్చుని దుర్గమ్మ కూనిరాగాలు తీస్తూవుంటుంది.

లక్ష్మి:పిన్నీ పిన్నీ... మా పిన్ని ఏదీ?

దుర్గ: మీ పిన్నెవరు? నువ్వెవరు?

అంజి–సోఫా రెక్కపై కూర్చుని: ఓహో.దుర్గాలత్తా నువ్వా? –లక్ష్మితో: ఈవిడ కనకదుర్గమ్మ. మన చుట్టమేలే.–– దుర్గమ్మవద్దకు వచ్చి సోఫా రెక్కపై కూర్చుని——ఏమత్తయ్యా–ఇలా దిగబడ్డావు?

దుర్గ: ఏం?ఇది పరాయి ఇల్లనుకున్నావా? మన పద్మ ఇల్లు.

అంజి: ఔన్లే. ఏం అత్తయ్యా? గాజులు దిట్టంగా తగిలించావ్? గిల్టువా?

దుర్గ: గిల్టువేం ఖర్మ? అచ్చమైన మేలిమి బంగారం.

అంజి: అదోలావుంటే అడిగాను. అద్సరే.మా గుండత్త ఏదీ?

దుర్గ: దానికి తగిన శాస్తి జరిగింది. దిక్కూమొక్కూ లేకుండా ఆ పంచలోపడి ఏదుస్తూంది.

అంజి: నువ్వుకొంపలో కాలుపెడితే మరంతేగా?

దుగ: నేనేం చెయ్యలేదు. దానికొడుకే చేశాడు. నామీదపడి ఏడిస్తే నాలుగు తగిలించి ఆ కొట్లో పడేశాను. (లక్ష్మికి కోపం వస్తుంది)—— అంజి లక్ష్మితో రహస్యంగా: దీనిసంగతి నువ్వు చూసుకో. నేను పట్టించుకోను.–– లక్ష్మిపెరట్లో గదితలుపు తడుతుంది.

లక్ష్మి; పిన్నీ పిన్నీ.——ఆ గొంతు గుర్తుపట్టి గుండమ్మ ఆనందంగాలేచి వస్తుంది. లక్ష్మి బయట గొళ్ళెం తీస్తుంది.

గుండమ్మ ఆప్యాయంగా: అమ్మా లక్ష్మీ. వచ్చావా తల్లీ. ––పట్టుచీర, ఒళ్ళంతానగలు తడిమిచూసి——బాగున్నావా అమ్మా.

లక్ష్మి: బాగానేవున్నాను. నీకెలావుంది?

గుండ: నాదేముందమ్మా? నేను చేసుకున్న ఖర్మకి అనుభవిస్తున్నాను. అల్లుడొచ్చాడా?

లక్ష్మి: వచ్చారు. పద లోపలికెళ్దాం.

గుండ: బెదిరిపోయి భయం భయంగా: నేనురానమ్మా. లోపలికొస్తే నాకాళ్ళు విరగ్గొడతానని చెప్పింది.

లక్ష్మి: మనింట్లో ఆవిడ పెత్తనమేంటి? నువ్వురా చెప్తాను.

గుండ: వద్దేతల్లీ. నేనురాను. నాపనంతా ఐపోయింది. నా డబ్బంతా కాజేశారు. నా నగలు కాజేశారు. పైగా నాకు దొంగతనం అంటగట్టి నన్నీ మూలపారేశారు. దీనికితోడు ఆ భూపతిగాడొకడు.

[ గంటన్న కొడుకు పేరు గోపాలం కాదు——భూపతి అని గమనిక ]

లక్ష్మి: మరి తమ్ముడేం చేస్తున్నాడు?

గుండ : వాడా? పెత్తనమంతా దీనికొదిలేసి పెళ్ళాన్ని తీసుకుని బెంగుళూరు పోయేడు. ఒకళ్ళని అనుకుని ఏముంది? నేను నీకు చేసిన అన్యాయానికి అనుభవిస్తున్నానమ్మా.(నిజమైన పశ్చాత్తాపంతో లెంపలేసుకుంటుంది). –లక్ష్మి కన్నీళ్ళు తుడుచుకుంటుంది : రా పిన్నీ.

గుండ: నేను రానమ్మా. నామాటవిను. –

లక్ష్మి: పర్వాలేదు నేనున్నాను. –గుండమ్మని లాక్కుపోతుంది.

గుండమ్మ——బెదిరి అవిసిన గుండెలతో: చెప్పినమాట వినమ్మా. అమ్మా... ఇంట్లో హాల్లో –లక్ష్మి వెనకవుండగా గుండమ్మ దుర్గమ్మ పక్కన సోఫాలో కూచుంటుంది.

దుర్గ: వచ్చావ్? ఎంత ధైర్యమే నీకు? లే.

గుండ: ఎందుకు లేవాలి? ఇది నా ఇల్లు.

దుర్గ: ఎక్కడుందే నీ ఇల్లు?

గుండ: ఇదికాదూ?

దుర్గ: ఎక్కడుందే ఇల్లు? ఇల్లట ఇల్లు. –గుండమ్మని కర్రతో కొడుతుంది.

లక్ష్మి: నువ్వుకూర్చో పిన్నీ.——దుర్గమ్మపక్కకి వెళ్తుంది.

దుర్గ: నువ్వు ఎవరే కూతురా?

లక్ష్మి: అమ్మ కూతుర్ని.

దుర్గ: అయ్య కూతురువికాదూ? –లక్ష్మి దుర్గమ్మ చేతిలో కర్ర లాక్కుంటుంది.

దుర్గ: నీ చేతులు పడిపోను. ఎవతివేనువ్వు?

లక్ష్మి:నువ్వెవతివే?

దుర్గ: నేను దిబ్బమీద దేవయ్య కోడల్ని.

లక్ష్మి: నేను పాటిమీద కోటయ్య మనవరాల్ని.

దుర్గ: ఛీఛీ.

లక్ష్మి: నోర్ముయ్. డబ్బెక్కడపెట్టావో తియ్యి.

దుర్గ: డబ్బెక్కడుందే?

గుండ: నన్నడుగమ్మా. నేను చెపుతాను.

దుర్గ: ఏవిఁటే నిన్నడిగేది?

గుండ: నువ్వుదాచిన డబ్బే.

దుర్గ: డబ్బెక్కడుందే?

గుండ: నీ పెట్టెలోనే. అమ్మా తెస్తానుండు. –లోనికిపోతుంది.

దుర్గ: ఇదుగో. నా పెట్టె ముట్టుకుంటే ఊరుకోను. –పోబోతుంది.––లక్ష్మి ఆమె చెయ్యి గట్టిగా పట్టుకుని :ఆగు.

దుర్గ: ఏయ్. నాసంగతి నీకు తెలుసా? ఇవి పిడకలు పెట్టిన చేతులు.

లక్ష్మి: ఏయ్. నా సంగతి నీకు తెలుసా? ఇవి గంటెలుదంచిన చేతులు. –కర్ర మోకాలిపైవిరిచి దుర్గమ్మ చేతిలో పెడుతుంది.

దుర్గ: ఓసి నీ చేతులుపడిపోను. –లక్ష్మి దుర్గమ్మని సోఫాలో కూలదోసి పక్కన కూర్చుంటుంది. గుండమ్మ దుర్గమ్మ పెట్టె పట్టుకొస్తుంది.

దుర్గ: ఏం కావాలే?

గుండ: పెట్టె తాళమే. –గుండమ్మ దుర్గమ్మ బొడ్లో తాళంచెవితీసి పెట్టె తెరుస్తుంది. : ఇదుగోనమ్మా డబ్బు.——లక్ష్మికి తీసి ఇస్తుంది.

దుర్గ: ఓసి నీనోరునొక్క. అందులో ఒక కట్ట నాదే. –గుండమ్మని కొడుతుంది.

గుండ: నీ మొహానికి డబ్బుకూడా ఎందుకే? –అమ్మా. ఈ గాజులన్నీ మనవే. –లక్ష్మి గుండమ్మ ఇద్దరూ కలిసిదుర్గమ్మ ధరించిన గాజులు, దుద్దులు వగైరా వొలిచి తీసుకుంటారు.

దుర్గ: ఇస్తానుండవే. ఇదుగో నీ ముష్టి గాజులు తీసుకో. –లక్ష్మి పెట్టె దుర్గమ్మ నెత్తినపెట్టి :పో.

దుర్గ: ఉండండుండండి. మా భూపతితోచెప్పి మిమ్మల్నేం చేస్తానో చూడండి.

లక్ష్మి:భూపతితోకాదు. వాడి తాతతో చెప్పుకో. –దుర్గమ్మని తోస్తుంది.

దుర్గ: నీ చేతులుపడిపోను. –స్తంభానికి ఆనుకున్న అంజితో: చూశావా.నన్నెంతపనిచేశారో?

అంజి: చూశానత్తా. ఎవరిదివాళ్ళే. మీరూమీరూ చూసుకోవాల్సిందే. నన్నిందులోకి లాగొద్దు.

దుర్గ: ఆఁ? అంతేనంటావా?

అంజి: అంతే.

దుర్గ: ఐతే సరే. —నిష్క్రమిస్తుంది.

★★★

రాజా——హాల్లో సోఫాలో కూర్చున్న తండ్రితో: నాన్నా. రేపు సరోజను కూలి డబ్బులకోసం మీదగ్గరికి పంపిస్తాను.

రామభద్రయ్య: ఆఁఆఁ. ఏమైనా దార్లోకి వచ్చిందా?

రాజా: వస్తుందిగా. మీరే పరీక్ష చేసుకోండి.

రా.భ: ఆఁఆఁ.

రాజా: వస్తాను.నాన్నా. ఆ చుట్టమాత్రం తీసెయ్యి.

రా.భ: అలాగే.

★★★

నిండుపున్నమి చందమామ. తోటలో ఫౌంటెన్ వద్ద సరోజ. రాజా వస్తుంటాడు. సరోజ పాట హమ్ చేస్తుంది——

సన్నగ వీచే చల్ల గాలికి... కనులు మూసినా కలలాయే...

రాజా:ఏమైనా కలగంటున్నావా?ఏంటా కల?

--పాట--

సన్నగ వీచే చల్ల గాలికి... కనులు మూసినా కలలాయే.... తెల్లని వెన్నెల పానుపుపై ఆ..... కలలో వింతలు కననాయే... సన్నగ వీచే చల్ల గాలికి... కనులు మూసినా కలలాయే.... తెల్లని వెన్నెల పానుపుపై ఆ..... కలలో వింతలు కననాయే... అవి తలచిన ఏమో సిగ్గాయే... కనులు తెరచినా నీవాయే.. నే కనులు మూసినా నీవాయే... కనులు తెరచినా నీవాయే..

నిదురించిన నా హృదయమునెవరో కదిలించిన సడి విననాయే... నిదురించిన నా హృదయమునెవరో కదిలించిన సడి విననాయే... కలవరపడి నే కనులు తెరువ నా కంటి పాపలో నీవాయే★... ఎచట చూచినా నీవాయే... కనులు తెరచినా నీవాయే.. నే కనులు మూసినా నీవాయే... కనులు తెరచినా నీవాయే..

మేలుకొనిన నా మదిలో ఏవో మెల్లని పిలుపులు విననాయే... మేలుకొనిన నా మదిలో ఏవో మెల్లని పిలుపులు విననాయే... ఉలికిపాటుతో కనులు వెతుక నా హృదయ ఫలకమున నీవాయే... కనులు తెరచినా నీవాయే.. నే కనులు మూసినా... నీవేనాయే...

★సరోజ రెండు కంటిపాపలలో చెరొక రాజా ప్రతిబింబం కనిపిస్తుంది.——Trick Photography.

★★★

(సశేషం)

COMMENTS